క్లుప్తంగా

వేగంగా ఆలయ నిర్మాణ పనులు



ఆలయం కోసం నిర్మించిన కాంక్రీట్ బేస్

పొదలకూరు : పట్టణంలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. దేవస్థానం నిర్మాణ కమిటీ రూ.15 లక్షల వ్యయంతో ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. పూర్తిగా దాతల సహాయ, సహకారాలు తీసుకుని పనులు చేపడుతున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఏడాది మే నెలలో హనుమజ్జయంతి సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను నిర్వహిస్తామని వెల్లడించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



పొదలకూరు : మండల సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి సతీమణి గోగిరెడ్డి ప్రభావతమ్మ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని నర్సారెడ్డికాలనీలో ఉన్న వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆమె జ్ఞాపకార్థం ప్రతిఏడాది సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు ప్రకటించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు మూలి సతీష్‌కుమార్‌రెడ్డి, ఎం.రవికుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చే తల్లి అంకమ్మ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కొర్నా నారాయణరావు

ఇందుకూరుపేట : మండలంలోని మైపాడులో కొలువైన అంకమ్మ తల్లి భక్తుల కోర్కెలు తీర్చే అమ్మవారని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కొర్నా నారాయణరావు అన్నారు. మైపాడులోని ఆలయ ఆవరణలో బుధవారం నూతన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముదిరాజ్‌ల సామాజిక వర్గానికి అన్నివిధాలా అండగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సంగం వెంకయ్య, వెంకటేశ్వర్లు, నరేష్, వెంకటరమణయ్య, బాబు పాల్గొన్నారు.

ప్రజాపోరు యాత్రకు సైనిక్ దళ్ మద్దతు



యాత్రకు మద్దతు ప్రకటిస్తున్న సమతా సైనిక్ దళ్ నేతలు

కొడవలూరు : కరెన్సీ నోట్లపై డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఫొటోను ముద్రించాలని కోరుతూ ఢిల్లీ వరకు జరిగే ప్రజాపోరు యాత్రకు సమతా సైనిక్ దళ్ జిల్లా యువజన విభాగం మద్దతు ప్రకటించింది. జె.పరశురామ్ ఆధ్వర్యంలో జరుగుతున్న యాత్ర కొడవలూరు మండలం నార్సురాజుపాళేనికి బుధవారం చేరుకుంది. ఈ సందర్భంగా నార్సురాజుపాళెంలో సమతా సైనిక్ దళ్ యువజన విభాగం జిల్లా నేతలు మద్దతు ప్రకటించారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మద్దతు ప్రకటించిన వారిలో సమతా సైనిక్ దళ్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బండి కిరణ్‌కుమార్, అంబేడ్కర్ ఆటో యూనియన్ మండల నేతలు గంగపట్నం మహేశ్వరరావు, పాదర్తి జాన్, బచ్చు చైతన్య, సూరి ప్రవీణ్, బచ్చు ఉదయ్ ఉన్నారు.

వృద్ధుడి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): హెయిర్ కటింగ్ చేయించుకొస్తానని ఇంటి నుంచి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన అనగుంటలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్ సమీపంలోని అనగుంటలో హేమలత తన పిల్లలు, అత్తామామలతో కలిసి ఉంటున్నారు. ఆమె భర్త పుష్పరాజు సౌదీలో ఉంటున్నారు. ఆమె మామ మునీంద్ర ఆచారి రెండు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. హెయిర్ కటింగ్ చేయించుకొస్తానని చెప్పి ఇంటి నుంచి ఈ నెల రెండున బయటకొచ్చారు. అప్పటి నుంచి అతని జాడ తెలియరాలేదు. కుటుంబసభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో వేదాయపాళెం పోలీసులకు హేమలత ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



రామదాసుకండ్రిగలో సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీస్తున్న మంత్రి కాకాణి

వెంకటాచలం : రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నాయని, దీంతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామదాసుకండ్రిగలో బుధవారం రాత్రి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పర్యటించారు. గ్రామానికి చేరుకున్న మంత్రికి స్థానికులు పూలమాలలు, కర్పూర హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. అన్ని సంక్షేమ పథకాలు అందుతుండటంతో పాటుగా దశాబ్దాలుగా రైతుల సాగునీటి కలను సాకారం చేయడంతో తాము సంతోషంగా ఉన్నామని రైతులు చెప్పారు. అనంతరం మంత్రి కాకాణి మాట్లాడుతూ గత ప్రభుత్వాల కంటే భిన్నంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగుతుందన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను నేరుగా అందిస్తున్నట్లు వివరించారు. గత టీడీపీ పాలనలో కొందరికే సంక్షేమ పథకాలు అందేవని, కానీ జగనన్న పాలనలో అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరుతోందన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, రైతులకు రుణమాఫీ, మనబడి నాడు–నేడు పథకంతో పాఠశాలల అభివృద్ధి, ఇలా అనేక సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. జగనన్న కాలనీల పేరుతో లేఅవుట్లు నిర్మించి ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేస్తుండటంతో ప్రజల గుండెల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోవడం ఖాయమన్నారు. గత టీడీపీ పాలనలో వారు సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధిని పక్కనబెట్టి, పూర్తిగా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ జరగని అభివృద్ధి పనులను రూ.కోట్లలో వెచ్చించి చేయిస్తున్నామన్నారు. గ్రామాల్లో మట్టిరోడ్లు కనిపించకుండా ప్రతి కాలనీలో సిమెంటు రోడ్లు నిర్మించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాజున్నీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు షాజహాన్, మోహన్‌నాయుడు, విజయభాస్కర్‌నాయుడు, వెంకటసుబ్బయ్య, నరసయ్య, వెంకటేశ్వర్లు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు రూ.1.50కే విద్యుత్

- ఆక్వా జోనేషన్ కమిటీ కన్వీనర్ సురేష్‌బాబు



కమిటీ సమావేశంలో సమీక్షిస్తున్న అధికారులు

మనుబోలు : ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50కే విద్యుత్ చార్జీలు వర్తిస్తాయని, అయితే ఆక్వా జోనేషన్ రీ సర్వేలో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే విద్యుత్ సబ్సిడీ వర్తిస్తుందని ఆక్వా జోనేషన్ కమిటీ కన్వీనర్ సురేష్ బాబు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఆక్వా జోనేషన్ రీసర్వేపై తహసీల్దార్ సుధీర్ అధ్యక్షతన మండల స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రీసర్వే ప్రకారం ఆక్వా రైతులను గుర్తించామని తెలిపారు. 180 మంది రైతులు 208.12 హెక్టార్లలో ఆక్వా సాగు చేస్తున్నారని వివరించారు. వీరిని ఆక్వా జోనేషన్‌లో చేర్చి రైతుల పేర్లను జిల్లా కమిటీకి పంపుతామన్నారు. వారి ఆమోదం పొందిన తరువాత గెజిట్ నోట్‌ను విడుదల చేస్తారని తెలియజేశారు. వీరికి మాత్రమే అన్ని సబ్సిడీలు వర్తిస్తాయన్నారు. ప్రభుత్వ భూముల్లో ఆక్వాసాగు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏఓ జహీర్, ఫిషరీస్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు



విద్యార్థులతో మాట్లాడుతున్న వైస్ మేయర్ ఏడుకొండలు

- ఫాల్సమ్ సిటీ వైస్ మేయర్ ఏడుకొండలు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : సర్కార్ పాఠశాలల్లో మెరుగైన వసతులు ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వ చర్యలు చాలా సంతోషంగా ఉందని అమెరికా దేశంలోని కాలిఫోర్నియా రాష్ట్రానికి చెందిన ఫాల్సమ్ సిటీ వైస్ మేయర్ చల్లంచర్ల ఏడుకొండలు అన్నారు. విడవలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఆయన బుధవారం ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను చాలా పేద కుటుంబం నుంచి వచ్చానని, ఈ పాఠశాలలోనే విద్యను అభ్యసించినట్లు గుర్తుచేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు అండగా నిలిచి అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, తల్లిదండ్రుల కమిటీ వైస్ చైర్మన్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, అశోక్, శ్రీనివాసులు, సుప్రజ, కామాక్షిజ్యోతి పాల్గొన్నారు.

ఎరువుల ఉత్పత్తితో పంచాయతీలకు లాభం

- ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం



వానపాముల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొడవలూరు : వానపాముల ఎరువు ఉత్పత్తిని మరింత పెంచడం ద్వారా పంచాయతీకి లాభదాయకమని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని యల్లాయపాళెంలో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రంలో వానపాముల ఉత్పత్తి కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వానపాముల ఎరువును ఉత్పత్తి చేస్తుండడం అభినందనీయమని, అయితే ఎరువు ఉత్పత్తిని పరిమితం చేయకుండా మరింత పెంచడం ద్వారా పంచాయతీలు మరింతగా లాభపడుతాయన్నారు. వానపాముల ఎరువుపై రైతులు బాగా ఆసక్తి కనబరుస్తున్నందున ఎరువు ఉత్పత్తిని మరింత పెంచడం ద్వారా పంచాయతీ ఆర్థిక పరిపుష్టి సాధించేలా కృషి చేయాలని కోరారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శులు బి.మధు, షరీఫ్ తదితరులు ఉన్నారు.

నేడు వెంకన్నపాళెంలో 'గడప గడపకు..'

తోటపల్లిగూడూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం మండలంలో పర్యటిస్తారని ఎంపీడీఓ హేమలత తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ వెంకన్నపాళెం పంచాయతీలో సాయంత్రం జరిగే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారన్నారు.

సీఎం జగనన్నకు కృతజ్ఞతలు

బుచ్చిరెడ్డిపాళెం : నెల్లూరు బ్యారేజీకి దివంగత మాజీ మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరు పెట్టడం చాలా సంతోషంగా ఉందని, ఈ నిర్ణయం తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బుచ్చిరెడ్డిపాళెం వైఎస్సార్‌సీపీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని రేబాలలో బుధవారం వారు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చేసిన సేవలకు నిజమైన గుర్తింపు లభించిందన్నారు. తెలుగుగంగ కాలువ నిర్మాణంతో పాటు సోమశిల సామర్థ్యాన్ని పెంచే విషయంలో ఆయన తీసుకున్న చొరవ మరువలేనిదన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైఎస్సార్‌సీపీ నేతలు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, మోర్ల మురళీ, మేనకూరు సీతారామిరెడ్డి, కోడూరు మధుసూదన్‌రెడ్డి, చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, ఇప్పగుంట విజయభాస్కర్‌రెడ్డి, చీర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ కనకదుర్గా భవాని

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అలసత్వం తగదని కావలి డీఎల్‌డీఓ కనకదుర్గా భవాని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మండలంలోని దంపూరు, వావిళ్ల సచివాలయాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన యూనిఫాంను ధరించాలన్నారు. అలాగే ప్రతిరోజు తప్పనిసరిగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు వచ్చిన అర్జీలపై స్పందించాలని ఆదేశించారు. అలాగే ఎస్‌డీజీ, జీఎస్‌డబ్ల్యూఎస్ సర్వేలను తప్పనిసరిగా చేయాలని తెలియజేశారు. దీని వల్ల బాలింతలు, గర్భిణులతో పాటు ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించి వారికి పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో డ్రాపౌట్స్ చేరికకు చర్యలు



డ్రాపౌట్ విద్యార్థులతో ఎంఈఓ, ఏపీఎంలు

కొడవలూరు : డ్రాపౌట్స్‌గా మారిన ఇద్దరు గిరిజన చిన్నారులను ఎంఈఓ జి.వసంతకుమారి చొరవతో బుధవారం గురుకుల పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకున్నారు. కొడవలూరు మూలకట్ట సంఘానికి చెందిన నంబూరు శేషయ్య, నంబూరు శ్రీనివాసులు అనే విద్యార్థులు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతూ కొంత కాలంగా పాఠశాలకు రావడం మానేశారు. దీని గురించి తెలుసుకున్న ఏపీఎం ఎస్.రుక్మిణితో కలిసి ఎంఈఓ బుధవారం మూలకట్ట సంఘానికి వెళ్లారు. ఇక్కడి డ్రాపౌట్స్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్య ఆవశ్యకతను తెలియజేసి పాఠశాలకు పంపేలా తల్లిదండ్రులను ఒప్పించారు. విద్యార్థులు కూడా పాఠశాలకు వెళ్లి చదువుకుంటామని స్పష్టం చేశారు. దీంతో ఆ ఇద్దరు చిన్నారులకు కొడవలూరులోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ డ్రాపౌట్స్‌గా మారిన ఇద్దరు చిన్నారులకు కొడవలూరు గురుకులంలో గురువారం అడ్మిషన్ ఇచ్చి చదువు కొనసాగించేలా చూస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట వెల్ఫేర్ అసిస్టెంట్ బాలకృష్ణ, సీఆర్‌పీ పెంచలరావు, వీఓఏలు జి.కవిత, కోటేశ్వరి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆశీర్వదించండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

కోవూరు : త్వరలో జరుగనున్న తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయ సంఘం (ఆపస్మా) నాయకులు కోరారు. కోవూరులోని పీవీఆర్ ఫంక్షన్ హాల్లో ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రైవేటు పాఠశాలల పట్ల శ్రద్ధ పెడుతున్నారన్నారు. ప్రైవేటు టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలతో పాటు జూనియర్, డిగ్రీ కళాశాలల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. చట్టసభల్లో ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా ఒక ఎమ్మెల్సీ ఉండటం అదృష్టమన్నారు. త్వరలో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును వేసి తనను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం పలువురు పాఠశాలల ప్రిన్సిపాళ్లను సన్మానించారు. కార్యక్రమంలో కోవూరు మండలాధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, ఏపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వర్‌బాషా, అపస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి, కోడూరు రాధికారెడ్డి, వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల మేనేజర్ కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

- పౌరసరఫరాల శాఖ డీటీ కృష్ణ ప్రసాద్



మాట్లాడుతున్న డీటీ కృష్ణ ప్రసాద్

కొడవలూరు : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అత్యంత పారదర్శకంగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ డీటీ కృష్ణ ప్రసాద్ స్పష్టం చేశారు. మండలంలోని తలమంచి సొసైటీలో రైతులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలోని లోపాలను సవరిస్తూ నూతన పద్ధతిలో కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. నాణ్యతా ప్రమాణాలున్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పారు. ఆర్బీకేలోనే నాణ్యతా ప్రమాణాలు పరీక్షించి ట్రక్ షీట్ జనరేట్ చేసి కేటాయించిన రైస్ మిల్లులకు పంపుతామని, ఈ విధానం వల్ల రైతులు సులువుగా ధాన్యం విక్రయాలు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఓ లక్ష్మి, ఉప సర్పంచ్ ఆత్మకూరు వెంకట సతీష్, ఆర్‌ఐ చాణక్య, వీఆర్వో వాణి, వీపీఏ ప్రసాద్, సొసైటీ సభ్యుడు ఎస్.రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

తోటపల్లిగూడూరు : యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బాలకృష్ణ సూచించారు. 'మాదక ద్రవ్యాల వినియోగం, పోక్సో చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్' అనే అంశాలపై వరిగొండ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈబీ సీఐ బాలకృష్ణ మాట్లాడుతూ యువత చెడు మార్గంలో పడి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాలతో భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. విద్యార్థులందరూ ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఉదయకళేశ్వరుని బ్రహ్మోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



బ్రహ్మోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పాలకవర్గ సభ్యులు, నేతలు

కొడవలూరు : మండలంలోని గండవరంలో కొలువైన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆలయ ప్రాంగణంలో బుధవారం ఆవిష్కరించారు. ఈనెల 14వ తేదీ నుంచి 22వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు స్వామివార్ల బ్రహ్మోత్సవాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి బి.శాంతయ్య మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున విస్తృత ప్రచారం కల్పించాలని నిర్ణయించామన్నారు. బ్రహ్మోత్సవ పోస్టర్లను జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రామాలకు పంపి ఎక్కువ మంది భక్తులకు తెలియపరిచేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, బెల్లం వెంకట నగేష్ నాయుడు, ఎస్కే.ముజీర్‌బాషా, ఎక్స్ అఫిషియో సభ్యుడు బండారు సుబ్రహ్మణ్యం, పాలకవర్గ సభ్యులు జి.బాబురావు, పి.శేషారెడ్డి, కె.దేవి, అర్చకుడు సర్వబొట్ల హరిప్రసాద్ పాల్గొన్నారు.

దాడి కేసులు నమోదు

నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. భగత్‌సింగ్ కాలనీకి చెందిన నజీర్ నగరంలోని చెప్పుల షాపులో పని చేస్తున్నారు. జనార్దన్‌రెడ్డికాలనీకి చెందిన జమీర్ చెప్పుల కొనుగోలు విషయంలో అతనితో మంగళవారం గొడవపడ్డాడు. అనంతరం పూటుగా మద్యం సేవించి దాడి చేసి గాయపర్చారు. ఘటనపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

- పాల విషయమై నెలకొన్న వివాదంలో వ్యక్తిపై దాడి చేసి గాయపర్చారు. పోలీసుల సమాచారం మేరకు.. కిసాన్‌నగర్‌కు చెందిన పాల వ్యాపారి పోలయ్య వద్ద స్వామి గతంలో పనిచేశారు. పాల విషయమై వీరి మధ్య కొద్ది రోజులుగా వివాదం సాగుతోంది. ఈ నేపథ్యంలో పోలయ్యపై స్వామి దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు నమోదు చేశారు.

భూముల పంపిణీలో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం


- తహసీల్దార్ ప్రసాద్

పొదలకూరు : ప్రభుత్వ భూముల పంపిణీలో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం ఇస్తామని తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో ఆయన బుధవారం మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో సాగు చేసుకుంటున్న భూములను అసైన్మెంట్ కమిటీ సమావేశం ఆమోదించిన తరువాత 8వ విడత భూముల పంపిణీ చేపడుతామని వివరించారు. ఈపాటికే గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను గుర్తించామన్నారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ మిగులు భూములు ఉంటే ఎస్సీ, ఎస్టీలకు ముందుగా ప్రాధాన్యత కల్పించి తర్వాత ఇతరులకు కేటాయిస్తామన్నారు. కుటుంబంలో ఎవరికి భూములున్నా నిబంధనల ప్రకారం అసైన్మెంట్ కమిటీలో ఆమోదించరన్నారు. మెట్ట 2 ఎకరాలు, మాగాణి ఒక ఎకరా భూమిని పంపిణీ చేస్తామన్నారు. ఈ మేరకు ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాలు ఉన్నాయని, అర్హులైన వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులను అందజేయడంతో పాటు గతంలో భూములు పొంది ఉంటే వాటి వివరాలను పొందుపర్చాల్సి ఉంటుందన్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన

ధాన్యం కొనుగోలు కేంద్రాలపై నిర్దేశించిన మహ్మదాపురం, సూరాయపాళెం, నావూరు, తాటిపర్తి, విరువూరు, నేదురుమల్లి వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాల్లో త్వరలో రైతులకు అవగాహన సదస్సును నిర్వహిస్తామని తహసీల్దార్ వెల్లడించారు. ఈ ఆర్బీకేల్లో ఏఓ, సీఏడీటీలతో కలిసి అవగాహన సదస్సులను నిర్వహిస్తామన్నారు.

తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కల్పన

ఇందుకూరుపేట : వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని ఎంపీడీఓ కల్పన అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ గంధళ్ల శంకరయ్య ఆధ్యక్షతన ఎంపీడీఓ కల్పన ఆధ్వర్యంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు వారి పరిధిలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, నిర్దేశించిన లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షులు కైలాసం లావణ్య, అద్దంకి మమత, అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విశ్రాంత పోలీస్ అధికారి ఇంట్లో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. డైకస్‌రోడ్డులోని ఎన్టీటీ కాలనీలో విశ్రాంత పోలీస్ అధికారి ఉన్నీసాబేగం నివాసం ఉంటున్నారు. కింది పోర్షన్లో ఆమె తమ్ముడు సిరాజుద్దీన్ ఉంటున్నారు. ఇటీవల ఆమె మక్కా యాత్రకు వెళ్లగా.. సిరాజుద్దీన్ సొంత పనిపై కడప వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఆమె ఇంట్లో చోరీకి సోమవారం రాత్రి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న సిరాజుద్దీన్ తన అక్కకు ఫోన్ చేసి ఇంట్లో విలువైన వస్తువులేమైనా ఉన్నాయానని ఆరాతీశారు. ఓ గదిలో 25 సవర్ల బంగారు, మరో గదిలో పింఛన్ నగదు ఉందని ఆమె తెలిపారు. దీంతో ఆయన తన కుటుంబసభ్యులను అప్రమత్తం చేశారు. ఇంటికెళ్లి వారు పరిశీలించగా, బంగారు ఆభరణాలు అక్కడే ఉండటాన్ని కనుగొన్నారు. మరో గదిలో నగదు లేకపోవడాన్ని గుర్తించారు. నగరానికి చేరు కున్న సిరాజుద్దీన్ ఘటనపై వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పింఛన్ నగదు రూ.30 వేల వరకు ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.